# మనోరంజితం – 5

తలెత్తి చూసిన మహిమ చిరునవ్వుతో మళ్ళీ తలవాల్చేసరికి అభిరామ్ ''ఆరె... విషయం ఏమిటో చెప్పకుండా అలా నానుస్తున్నావేంటి... నీ ధోరణి చిత్రంగా ఉందే...!'' అంటూ తమాషాగా నవ్వాడు.

మహిమ అతనివేపు ఓ క్షణం సూటిగా చూసి చిరునవ్వుతో అంది ''మీతో ఒకసారి... మీరు మీ నాన్నగారి క్రమశిక్షణ గురించి కోపంగా చెబుతోంటే... మీకూ ఆయనను అర్థం చేసుకునే పరిస్థితి వస్తుందని చెప్పానా... అదిపుడు వచ్చింది...!''

అభిరామ్ అయోమయంగా చూస్తూ ''ఏం చెప్పావో, అదేమిటో నాకస్సలు గుర్తులేదు...!'' అన్నాడు నిర్లిప్తంగా.

మహిమ అలక నటిస్తూ ''మీతో కలిసినపుడు... ఆ రోజుల్లో మీరు చెప్పిన ప్రతీమాటా నా మనసులో గ్రంథస్తం చేయబడ్డట్టుగా ముద్రించుకుపోయింది! ఇష్టమైన వాళ్ళ మాటలకు, ఆ ప్రాముఖ్యత ఉంటుంది! మీరు నా మాటల్ని అంత తేలికగా మర్చిపోయానని చెబుతుంటే... ఏమనుకోవాలి...?'' అంది.

'' నా జ్ఞాపకశక్తి అంత బలహీనమైదని గ్రహించాలి... అంతేగాని... ఇష్టానికీ, జ్ఞాపకశక్తికీ లింకు పెడితే ఎలా...?''

''ఓహో... అందుకే కాబోలు... మీలా నేనూ మరిచిపోతానేమోననుకుంటూ 'కావలిస్తే రాసి పెట్టుకో...' అని అంటూంటారు. అవునా...? నాకు మాత్రం అలాంటి అవసరం లేదు. చెప్పానుగా, అలా ముద్రించుకు పోతాయని... అవసరమైనపుడు వెనక్కివెళ్ళి పేజీలు తిరగేస్తే చాలు... క్షణంలో అన్నీ గుర్తుకు వచ్చేస్తాయి....!''

''ఇంత పురాణం చెప్పే బదులు... అదేమిటో ఒక్క ముక్కలో గుర్తు చేయకూడదా...?'' అంటూ నవ్వాడతను.

''చెప్పకేం చేస్తానూ...' అంటూ చురుగ్గా చూసిన మహిమ ఒక క్షణం ఆగి మెల్లగా చెప్పింది.

''మీరు... మీరుకూడా మీనాన్నగారి ప్రేమను అర్థం చేసుకునే పరిస్థితి వచ్చిందంటే అర్థం... మీరూ తండ్రి కాబోతున్నారని చెప్పటమే...!'' అంటూ మహిమ నవ్వింది.

అభిరామ్ కూడా ఆనందంగా నవ్వేసాడు.

''అబ్బ...! ఈ విషయం చెప్పటానికా అలా డొంక తిరుగుడులో నన్ను తికమక పెట్టావ్...! ఇంకో బుల్లి ప్రాణి వచ్చి... మనందరి చేతా గెంతులు వేయిస్తుందన్నమాట...!'' సరదాగా అన్నాడు అభిరామ్.

''ఇంకో అన్నారేమిటీ...? ఇంతకు ముందు ఇంకెవరూ లేరుగా, ఇదే మొదటిసారి కదా...?''

''అవునుకదూ... నన్ను బొమ్మలా ఆడిస్తున్న ప్రాణి... ఈ ఇంట్లో నువ్వే. ఇపుడు వచ్చేది రెండో నెంబరేనని... అనుకోకుండానే నా నోట వచ్చేసింది...!''

''అంటే... నేను బొమ్మలా ఏం ఆడిస్తున్నాను...?'' ఆశ్చర్యం చూపిస్తూ అడిగింది మహిమ.

''అమ్మవాళ్ళు ప్రయత్నించి... లాభం లేదని వదిలేసిన కేసును నీ చేతిలోకి తీసుకుని మరమత్తు చేసి మనిషిగా మార్చేశావు...! ఇపుడు... టైముకు ఇంటినుండి వెళ్ళటం... అలానే టైముకి ఇంటికి ఠంచనుగా చేరటం...! ఇదంతా... నువ్వు 'కీ' ఇచ్చి నన్ను బొమ్మలా ఆడించటం వలనేగా...!''

మహిమ నవ్వింది ''నిజంగా... నా చేతులకు అంత శక్తి ఉందా...? మీరలా చెబుతుంటే... నాకు పట్టపగ్గాలు లేనట్లుగా అయిపోతోంది...!'' అంది ఆనందంగా.

* * *

ఆ మరునాడే మహిమ, మనోరమ హాస్పటల్‌కి వెళ్ళి వచ్చారు. డాక్టరు ద్వారా కూడా ఆ వార్తని నిర్ధారించుకోవాలని అనుకుంది మహిమ.

డాక్టరు అదే మాటను చెప్పగానే మనోరమ మొహం ఆనందంతో వెలిగిపోయింది. ''ముందుగా మీ అమ్మగారికి ఈ వార్త చెప్పాలిగానీ... నువ్వు ఇప్పుడే చెప్పకు. నేను ఏదో కారణం చెప్పి మనింటికి భోజనానికి రమ్మని పిలుస్తాను... అపుడు చెబుదువుగానీ...!'' అంది మహిమతో.

మహిమ చిరునవ్వుతో అలాగే నన్నట్లుగా తలవూపింది.

అనుకున్నట్లుగా మనోరమ వసుంధరకి ఫోను చేసి... సెలవుపెట్టి, ఆరోజంతా తమతో గడపటానికి రమ్మని పిలిచింది. కారణం అడిగితే వచ్చాక చెబుతానంటూ దాటవేసేసరికి వసుంధరా రెట్టించలేదు. రెండు రకాల పిండివంటలు తయారుచేసి వెంట తీసుకువచ్చింది వసుంధర. రాగానే మనోరమని ''విశేషం ఏమిటో ఇపుడైనా చెప్పండి'' అనడిగింది. ''మీరే ప్రయత్నించి తెలుసుకోండి...'' అంది మనోరమ సరదాగా నవ్వేస్తూ.

''ఎవరిదైనా పుట్టినరోజు లాంటిది ఉందా...?'' అనుకుంది పైకే వసుంధర ఆలోచిస్తున్నట్లుగా మనోరమ మళ్ళీ నవ్వింది.'' మా పెద్దవాళ్ళెవ్వరికీ మొదటినుండీ అలవాటు లేదు. మీ అమ్మాయిది అయివుంటే మీకే తెలుస్తుంది కదా... ఇక మా అబ్బాయికీ ఇష్టం ఉండదు. నేనెపుడైనా గుర్తు చేసినా చిర్రుబుర్రులాడటంతో... ఇక ఆ పని మానేసాను. దాంతో పుట్టినరోజు ఎపుడో ఏమిటో వాడికీ, మాకూ కూడా గుర్తుండదు...''

''మీ అమ్మాయి చెబుతుందిగానీ, ముందు స్వీటు తినండి వదినా..." అంటూ మనోరమ ఒక ప్లేటు చేతికి ఇవ్వగానే... వసుంధరకి అర్థమైపోయింది.

ఆనందంగా కూతురి చేయి పట్టుకుని కళ్ళతోనే ప్రశ్నించింది.

అవునన్నట్లు మహిమ తలవూపగానే ఆవిడ హాయిగా నవ్వేసింది. ''చూశారా... మీకు ముందే తెలిసిపోయినట్లుగా మీ అమ్మాయికి ఇష్టమైన పిండి వంటలు చేసి తీసుకువచ్చేశారూ..!'' అంది మనోరమ వసుంధరతో.

అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. సాయంకాలం వరకూ మహిమా, వసుంధరా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశాక వసుంధర ఇంటికి బయలుదేరి వెళ్ళిపోయింది.

సాయంకాలం అభిరామ్ ఇంటికి రాగానే ''మీ పుట్టినరోజు ఎపుడు...'' అంటూ మహిమ నవ్వు నొక్కి పట్టి చూసింది.

''ఎపుడో... ఏమిటో ఇపుడెందుకూ...?'' అని ''నాకసలు గుర్తు ఉండ...'' నాలిక కరుచుకుంటూ మాటలు ఆపేశాడు.

మహిమ పకపకనవ్వింది.

''ఆరోజు... మీ బర్తడేని సెలబ్రేట్ చేసుకుంటున్నట్లు ఊరంతా తిరిగి వచ్చాం కదా? అపుడే ఆ సంగతి మర్చిపోయారా...?''

''నిజమేలే... అదే రోజో గుర్తులేదు. అసలు తేదీ ఒకటి అయితే సర్టిఫికేట్స్‌లో ఇంకోటి ఉంటుంది. అందుకే నాకెపుడూ ఆ విషయంలో తికమకనే...!''

మహిమ... తన అమ్మతో అత్తయ్య చెప్పిన మాటలంటూ వివరించి చెప్పింది.

''అమ్మ చెప్పింది నిజమే...'' అంటూ అభిరామ్ నవ్వాడు. ''నేను పాయసం మాట ఎత్తగానే, మీరేదో ఊహించుకుని ఏదో అంటే... సరేలే అనుకుని నేనూ సమ్మతించినట్లు తలవూపేశాననుకుంటా! చూశావా... నీ ప్రేమకోసం... నీతో కాలక్షేపం చేసే అవకాశం కోసం ఎన్ని తిప్పలు పడ్డానో...! మనసులో మాత్రం... నీపై ప్రేమ పుట్టిన రోజును జరుపుకుంటూ... అది వెల్లడి చేసే అవకాశం దొరికినట్లుగా ఆనందించానన్న మాట...!''

మహిమ నవ్వు మొహంతోనే నిట్టూర్చింది.

''పెళ్ళికి ముందు అబ్బాయి ప్రేమ తుఫానులా ఉక్కిరిబిక్కిరి చేసేంత ఉధృతంగా ఉండి... పెళ్ళి కాగానే నెమ్మదించేస్తుంది! అమ్మాయిలదేమో రివర్సులో సాగుతుంది...!''

అభిరామ్ చిన్నగా నవ్వుతూ ''ఎవరో అన్నారేల్లే... ఎన్నికల ముందు ప్రచారం చేస్తాంగానీ, ముగిసేకా కూడా చేస్తామా అని...! నిజమేకదూ...?'' అన్నాడు.

మహిమా సరదాగా నవ్వేసి వూరుకుంది...!

* * *

మహిమ పట్ల ఇంట్లో వాళ్ళంతా శ్రద్ధ చూపిస్తూ ఆరోగ్యంగా ఉండటానికి ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో తమకు తెలిసినవి చెబుతున్నారు. వసుంధర కూడా వీలున్నపుడల్లా కూతురికి ఇష్టమైనవంటూ... ఏవేవో చేసి తీసుకువచ్చి ఇస్తోంది.

మనోరమ ఒకసారి వసుంధరని కొంచెం నెమ్మదిగానే హెచ్చరించింది. ''మీరు.. మీ అమ్మాయికోసం ఏమైనా చేసి ఇవ్వాలనుకుంటే... ఇక్కడికి వచ్చి చేస్తే, సహాయంగా చాలామందిమి ఉంటాం. మీరొక్కరూ అక్కడ ఇంతంత మొత్తం చేసి తీసుకురావటం బావుండలేదు...! కానీ ఈ కారణంగానైనా మీరు అపుడపుడూ అయినా రావటం మాత్రం బావుంది! అందరం ఒక కుటుంబంలా ఇలా కలిసిపోవటం... నాకు మాత్రం సరదాగా ఉంది! ఇక మనవడో, మనవరాలో వచ్చాక, మన ఇద్దరి ఇళ్ళమధ్యా రాకపోకలూ పెరుగుతాయి...! అలాగే మనవల ముచ్చట్లూ కూడా!''

మహిమ కూడా తల్లితో చెప్పింది ''అత్తయ్య చెప్పింది విన్నావుగా అమ్మా! నాకు ప్రత్యేకంగా ఏదో తినాలనేం లేదు. నువ్వు... ఇలాంటి పనులేం పెట్టుకోకు. నాకు కష్టంగా ఉంటుంది. వీలు ఉన్నపుడల్లా వస్తూంటే చాలు నాకు...!''

వసుంధర నవ్వి వూరుకుంది.

ఆ తరువాత వచ్చినపుడు... ఆపై నెలలో మహిమను తన దగ్గరకు తీసుకువెళ్లాలని వసుంధర మనోరమను అడిగింది.

''ఒకేవూరు కదా... ఎక్కడయితేనేం... పైగా మీరు స్కూలుకు వెళ్ళాల్సి వుంటుంది కూడానూ...' అని మనోరమ అభ్యంతరం చెప్పినట్లుగా మాట్లాడేసరికి ''అదేం లేదండీ... నేనూ కొన్నాళ్ళు సెలవు పెట్టేస్తున్నాను... ఎక్కడైనా ఒకటేగానీ... పద్ధతి ప్రకారం...'' అంటూ వసుంధర నసిగింది.

''మీ ఇష్టం మరి...! ఇక నుండీ అపుడు మీ ఇంటికి మా అందరి రాకపోకలూ మొదలు అవుతాయి...!'' అంది మనోరమ.

''ఈ కారణంగా... మీ రాకపోకలతో మా ఇంటికి కళ వస్తుంది! సందడీ పెరుగుతుంది! అదీ అదృష్టమే...!'' అంది వసుంధర ఆనందంగా...!

అయితే... అనుకున్నట్లుగా అన్నీ జరగవని ఆపై నెలలోనే తెలిసింది.

హఠాత్తుగా వసుంధర కన్నుమూసిందనే కబురు వచ్చింది. అనుకోని దుర్ఘటనకి అందరూ తల్లడిల్లిపోయారు. మహిమను ఓదార్చటం ఎవరి వల్లా కావటం లేదు. హార్ట్ ఎటాక్ అన్నారు. ఇంట్లో వాళ్ళందరి ఓదార్పుతో రోజులు గడిచేకొద్ది మహిమ కొంచెం కొంచెంగా తేరుకుని మామూలు అవుతోంది! ఒంటరిగా వుంటే... తల్లి జ్ఞాపకాలతో మరీ కృంగిపోతోందని మనోరమ ఎక్కువగా మహిమను కనిపెట్టుకుని పక్కనే ఉంటోంది.

అభిరామ్ కూడా కాలేజి నుండి ఎటూ వెళ్ళకుండా ఇంటికే వచ్చేసి మహిమ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుంటున్నాడు. అభిరామ్ అలా బాధ్యతగా ప్రవర్తించటం... మనోరమ దంపతులకు ఆశ్చర్యంతో పాటూ సంతృప్తిని కలిగించింది!

అభిరామ్ చూపిస్తున్న శ్రద్ధాసక్తులకు మహిమ ఊరటపొంది తొందరగానే తేరుకుంది.

''చూడు మహీ... కొద్ది కాలంలో రిటైరవబోయే అత్తయ్యనూ ఇక్కడకు తీసుకువచ్చేద్దామని అంటే... ఇక్కడయితే బెరుకుగా ఉంటుందీ... ఎవరింట్లో వాళ్ళకి స్వతంత్రంగా ఉంటుంది కాబట్టి రాకపోవచ్చని అన్నావు. మనవరాలిగా పుట్టి... కూతురితోనే ఉండాలనే అలా ఆ జీవితాన్ని ముగించి... నీకు పాపాయిగా జన్మిస్తారేమో అనిపిస్తోంది నాకు...!''

అభిరామ్ మాటలకు మహిమ నిర్లిప్తంగా నవ్వి పూరుకుంది.

తొమ్మిది నెలలూ నిండాక అమ్మాయే పుట్టేసరికి... అభిరామ్ ''చూశావా... నా జోస్యం ఎలా నిజమైందో...!'' అంటూ నవ్వాడు.

మహిమకూ ఆనందం కలగింది. పాపని ఎత్తుకుని మురిపెంగా చూసుకునే ప్రతీసారీ అభిరామ్ మాటలు 'నిజమేనేమో' అనుకునేది! ఆ భావనతో మహిమ మనసు సంతృప్తితో... సంతోషంతో పొంగిపోయేది!

తల్లిపేరునే పాపాయికి 'వసుధ'గా పెట్టాలని నిర్ణయించుకున్నపుడు, అంతా ఆనందంగా అంగీకారం తెలిపారేగానీ ఎవరూ అభ్యంతరం చెప్పలేదు!

వసుధ రాకతో ఆ ఇంటిలో వసంతం చిగురించినట్లు... అందరిలో ఆనందోత్సాహం...! చిన్నారి వసుధ ముద్దు ముచ్చట్లతో అందరికీ రోజులు పరుగెత్తుతున్నట్లే అనిపిస్తోంది.

మనోరమ, మహిమ ఖాళీగా ఇంట్లో ఇద్దరే ఉన్నపుడు... వసుంధర సంగతుల్ని నెమరేసుకోవటం పరిపాటి.

ఆరోజు మనోరమ చెప్పిన సంగతులు విన్న మహిమ ఆశ్చర్యానికి అంతులేదు. తనకే తెలియని విశేషాలెన్నో మనోరమ నోటివెంట విని ఆశ్చర్యానందాలకు లోనైంది!

వసుంధర ప్రతీ నెలా తన జీతం నుండి ఇద్దరు పిల్లలకు సగం సగం ఫీజులు కట్టి సహాయపడుతూండేదట. అలాగే మరి ఇద్దరు పేద పిల్లలకూ పుస్తకాలు కొనుక్కోవటానికీ ఆర్థిక సహాయం అందించేదట.

వాళ్ళ స్కూలులో ప్రతీరోజూ ఉదయం పిల్లలందరూ చేరి ప్రార్థనాగీతాల్ని ఆలపించే అలవాటు ఉంది. రోజుకొకరు చొప్పున టీచర్లు కూడా తమకు తోచిన ఒకటిరెండు నీతికథలో లేక ఇంకేవైనా గ్రంథాలలోని విషయాలో చెప్పే పద్ధతి ఉంది! పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించటానికి ఆ బోధనలు, ప్రార్థనలూ కొంతయినా ఉపకరిస్తాయని స్కూలు యాజమాన్యం ఆలోచన అట! ఇది వసుంధరకి బాగా నచ్చి తను పొదుపు చేసిన డబ్బు నుండి కొంత మొత్తంతో ప్రార్థనా మందిరం గోడలకు అన్ని మతాలకూ చెందిన సంఘటనలను బొమ్మల రూపంలో ఆర్టిస్టులతో వేయించిందట... స్కూలువాళ్ళ అనుమతి తీసుకుని.

వసుంధర చనిపోయినరోజు స్కూలు నుండి వచ్చిన టీచర్లు, పిల్లలు కొంతమందీ ఈ సంగతులన్నీ తనతో చెప్పారని మనోరమ వివరించింది మహిమకు.

ఇలా ఇలా ఖర్చు చేస్తున్నానని చివరకు స్వంతకూతురితో కూడా చెప్పుకోని ఆమె నిరాడంబరతకు ఇద్దరూ మనసులోనే జోహారులర్పిస్తూండే వారు!

* * *

వసుధ మొదట పుట్టినరోజు నాడు వేడుక ఎలా చేయాలి ఏమిటీ అని ప్రసక్తి వచ్చినపుడు ఆ సంవత్సరం నలుగురినీ పిలిచి చేయకపోవటమే మంచిదని అందరూ కలిసి అనుకున్నారు. బయట వాళ్ళెవరినీ పిలవకుండా ఇంట్లోనే అనుకున్నారు.

''మొదటినుండీ మీకు అలవాటు లేకపోయినా, మనవరాలితో ఆ ముచ్చట మొదలు పెట్టాలని అనుకునేదాన్ని. కానీ... పాప అమ్మమ్మ లేకుండా చేయటం నాకే సమంజసంగా అనిపించటం లేదు. ముందు ముందు ఆలోచించవచ్చులే...!'' అని మనోరమ తన అభిప్రాయం చెప్పినపుడు మహిమా అంగీకరిస్తున్నట్లుగా తలవూపి వూరుకుంది.

అయితే అభిరామ్ మాత్రం ''నా ఫ్రెండ్సంతా పార్టీ ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. నాకు ఇష్టం లేకున్నా తప్పేట్లు లేదు. పాప పుట్టినపుడయితే, అత్తయ్య చనిపోయిన దుఃఖం ఇంకా తగ్గకముందే ఏమిటంటే వాళ్ళూ ఏమనలేదు. ఇపుడేమో... అబ్బాయి అయితేనే పార్టీ ఇచ్చేవాడివా, అమ్మాయి అయినందువలన ఇష్టం లేదంటున్నావా అని నిలదీస్తున్నారు. నాకు ఎవరైనా ఒకటే అని ఒప్పుకున్నట్లు చెప్పటానికయినా పార్టీ ఇవ్వాల్సి వస్తోంది...!'' అంటూ వివరించేసరికి 'నిజమేకదా' అనుకుంది మహిమ.

ఆరోజు బాగా డ్రింకు తీసుకుని ఇంటికి వచ్చినపుడు ''ఇదేమిటీ...?'' అంటే... ''ఏదో ఈ ఒక్కరోజుకీ నలుగురితో పాటూ తప్పలేదు. నేనే ఇస్తున్న పార్టీలో నేను తీసుకోకుండా వుంటే... వాళ్ళంతా ఏమనుకుంటారూ.. అందుకే తప్పలేదు... నలుగురూ మాటలతో మరపించేసరికి... కొంచెంగా ఎక్కువా అయింది... తెలియకుండానే...!'' అంటూ అభిరామ్ సంజాయిషీ ఇచ్చాడు.

దీనికీ మహిమ నిజమేగా అని సమాధానపడిరది.

ఆ పద్ధతి మళ్ళీ అపుడపుడూ కూడా ప్రారంభం అయేసరికి, కొంచెం కలవరపాటు కలిగింది.

''హద్దు దాటుతున్నపుడు హెచ్చరించు... అపుడు కాదంటే నిలదీయిగానీ లిమిట్స్‌లోనే

ఉంటున్నాగా... ఇదేం సమస్య కాదులే...!'' అంటూ సర్దిచెప్పాడు.

అయితే... తనకి తెలసి కొన్ని సార్లు, తెలియకుండా మరింతగా ఆ అలవాటు కొనసాగుతోందని మహిమ పసిగట్టలేకపోయింది! దానికి కారణం... అభిరామ్ ప్రవర్తనలో ఎటువంటి మార్పూ కనపించకపోవటం వలనే...!

ఇంటికి రాగానే వసుధను దగ్గరకు తీసుకుని సరదా కబుర్లు చెప్పటం... ఆదివారాలు మహిమ, వసుధతో కలసి ఎక్కడికో అక్కడికి వెళ్ళిరావటం జరుగుతోంది!

ఆ సంవత్సరమే నిరంజన్ రావు రిటైరయ్యారు.

ఇల్లు మారాల్సి వచ్చింది. అప్పటికే రెడీ అయిన స్వంత ఇంటికి మారారు. ఇంటి చుట్టూ పెద్ద ఖాళీ స్థలం, మొక్కలు మునుపటిలా లేకపోవటమన్నది లోటుగా అనిపించినా, తొందరగానే ఆ ఇంటికి అలవాటు పడ్డారంతా.

అభిరామ్ కే ఆ ఇంటి వాతావరణం కొంచెం చిరాకుగా అనిపించింది. మునుపు తల్లి తండ్రి పడకగది తమగదికి కొంచెం దూరంగా ఉండటం వలన వేరేగా ఉంటున్నట్లే స్వతంత్రంగా అనిపించేది! ఇపుడేమో అలా కాకుండా పక్క పక్కనే ఉండటంతో తన రాకపోకలు, అన్ని విషయాలు వెంటనే తెలిసిపోయే అవకాశం ఉండటం అభిరామ్ కు అంతగా నచ్చలేదు.

నాలుగో సంవత్సరం రావటంతో వసుధ దగ్గరలోనే ఉన్న కాన్వెంట్‌లో చేరింది. నిరంజన్ రావు కూడా ఇంట్లోనే ఉండటంతో మనవరాలితో కాలక్షేపం ఎక్కువయింది.

అపుడే... మహిమ మళ్ళీ తల్లి కాబోతోందనే విషయం అందరికీ తెలిసింది. అభిరామ్ ''ఈ సారి మాత్రం అబ్బాయే పుట్టాలి...!'' అన్నాడు మహిమతో, సరదాగా అన్నాడో, సీరియస్‌గానో అర్థంకాని మహిమ చిరునవ్వుతో ''అది నా చేతుల్లో ఉన్నది కాదుగా, ఎవరయినా ఒక్కటే అనుకోవాలి... అంతే...!'' అంది.

''అయనా మనసులో కోరిక అంటూ వుంటుందిగా, నెరవేరటం, కాకపోవటం అన్నది పూర్తిగా వేరే సంగతిగానీ...! ఒక్క ఆడపిల్ల అయితేనే పెళ్ళి, పేరంటాలు అన్నీ కష్టమే... అదనంగా ఈ రోజుల్లో పెద్ద చదువులూ తప్పవు, ఇక ఇద్దరూ ఆడపిల్లలయితే... ఆ అగచాట్లు వేరే లెవల్‌లో ఉంటాయి...!'' అన్నాడు పెద్దగా నవ్వుతూ.

అది వేళాకోళమే అయినా కూడా భరించలేనట్లనిపించి... అభిరామ్ వైపు మహిమ కొంచెం కోపంగా చూసింది.

అక్కడే వున్న పెద్దవాళ్ళూ ఆ విషయం గమనించారు.

మనోరమ నిట్టూరుస్తూ అంది ''ఇలాంటి ఆలోచన.. పాత తరానికి చెందిన దాన్ని అయినా నాకే రాలేదు... నువ్వేంటీ ఇలా మాట్లాడటం...?''

''నీకు ఇలాంటి సమస్య ఎదురుకాలేదు కదమ్మా...? ఒక్కడే కొడుకు...'' నవ్వు మోహంతో అన్న అభిరామ్ వైపు మనోరమ మొహం చిట్లించి చిరాగ్గా చూసింది.

''ఇద్దరూ ఆడపిల్లలయితే... అదృష్టమే అనుకోవాలిగానీ, భయమెందుకూ...? ఆనందంగా పెంచాలి.. ఆ తర్వాత వాళ్ళ భవిష్యత్తును వాళ్ళే తీర్చి దిద్దుకుంటారు!''

తల్లి మాటలకు అభిరామ్ వ్యంగ్యంగా నవ్వాడు.

మహిమ ఏదో మాట్లాడాలనుకునీ, పెద్దవాళ్ళిద్దరూ ఉండటం వలన ఆ ప్రయత్నం విరమించి అభిరామ్ వైపు విస్మయంగా చూస్తుండిపోయింది.